సేంద్రియ ఎరువులు భారం

- రైతుల నుంచి పెరుగుతున్న డిమాండ్
- కోడి ఎరువు లారీకి రూ.28వేల నుంచి రూ.30 వేలు



సేంద్రియ ఎరువు కోసం గొర్రెల మంద

జగిత్యాలఅగ్రికల్చర్: సేంద్రియ ఎరువుల ధరలు రైతులకు భారంగా మారుతున్నాయి. ప్రతి ప్రతి రైతుకు ఎడ్లు, గేదెలు, ఆవులు, మేకలు, గొర్రెలు ఉండేవి. వాటి పేడను సేంద్రియ ఎరువులుగా వేసేవారు. ప్రస్తుతం గ్రామాల్లో ఆ పరిస్థితి లేకుండా పోయింది. భూసారానికి అవసరమైన పశువులు, కోళ్లు, గొర్రెల ఎరువును ఫారాల నుంచి తెప్పించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఎరువులకు రైతుల నుంచి ఏటేటా డిమాండ్ పెరగడంతో ధరలు అమాంతం పెరిగాయి. జిల్లాకు హైదరాబాద్, చుట్టుపక్క కోళ్ల ఫారాల నుంచి ఏటా 800 నుంచి వెయ్యి లారీల కోడి ఎరువు వస్తుంటుంది. జిల్లాలోని కోళ్లఫారాల యజమానులు ట్రాక్టర్ల ద్వారా ఎరువును విక్రయిస్తున్నారు. కొందరు రైతులు గొర్రెల మందను పొలంలో పెడుతున్నారు.

పెరుగుతున్న ధరలు

సేంద్రియ ఎరువుల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ప్రస్తుతం లారీ కోడి ఎరువుకు రూ.28వేల నుంచి రూ.30 వేల వరకు ఉంది. పశువుల ఎరువు లారీకి రూ.25వేల నుంచి రూ. 26వేల వరకు ఉంది. లారీల్లో వచ్చిన ఎరువును తోటల్లో చల్లడానికి మరో రూ.5 వేల వరకు ఖర్చు అవుతుంది. ఒక్కో రైతు కనీసం కోళ్ల ఎరువుకే రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చు చేస్తున్నాడు.

సేంద్రియ ఎరువుల్లో పోషకాలు

సేంద్రియ ఎరువుల్లో భూమికి అనేక పోషకాలు లభిస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఒక పశువు నుంచి ఏటా 7 టన్నుల పేడ, 2500 లీటర్ల మూత్రం వస్తుంది. గేదె పేడతో ఏటా 27.21 కిలోల నత్రజని (55 కిలోల యూరియాతో సమానం), 13.60 కిలోల భాస్వరం (85 కిలోల సింగిల్ సూపర్ పాస్ఫేట్‌తో సమానం), 6.8 కిలోల పొటాష్ (12కిలోల పొటాష్‌తో సమానం) లభిస్తుంది. దీని ప్రకారం ఏ పంటకైనా రసాయన ఎరువులు వాడకుండా సేంద్రియ ఎరువులతోనే పంట పండించే అవకాశం ఉంది.

ఏటా కోడి ఎరువు చల్లుతా



పసుపు, మొక్కజొన్న పంటకు ఏటా రెండు లారీల కోడి ఎరువు తెప్పిస్తా. భూసారం కోసం సేంద్రియ ఎరువులు వాడాల్సిందే. కోడి ఎరువు ధర రైతులకు అందని స్థాయిలోకి చేరుకుంది. అయినా తప్పేలా లేదు.

– నక్కల రవీందర్ రెడ్డి, అంతర్గాం

సేంద్రియ ఎరువులు వాడాలి



రైతులు సేంద్రియ ఎరువును తప్పనిసరిగా వాడాలి. పశువులు, కోళ్ల ఎరువుల ధరలు పెరుగుతుండటంతో కొంతమంది రైతులు అవసరమున్నా, లేకున్నా రసాయన ఎరువులు వినియోగిస్తున్నారు. తద్వారా భూమి సత్తువ కోల్పోతోంది.

– శ్రీలత, పరిశోధన స్థానం డైరెక్టర్, పొలాస

క్లుప్తంగా

ఆర్మీ జవాన్‌కు సన్మానం



ఆర్మీజవాన్ రమేశ్‌ను సన్మానిస్తున్న మిత్రులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని కోజన్‌కొత్తూర్‌కు చెందిన ఆర్మీ జవాన్ తోట రమేశ్ ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొని సెలవుపై స్వగ్రామం రావడంతో ఆయన మిత్రులు సన్మానించారు. రమేశ్ తల్లి భాగ్యలక్ష్మి, భార్య లత మాట్లడుతూ.. రమేశ్ దేశ ఆడబిడ్డల నుదుటి బొట్టు తుడిచిన వారికి బుద్ధి చెప్పారని, ఇది తమకు గర్వంగా ఉందన్నారు. మిత్రులు ముక్క శ్యాంసుందర్, రాగి రాజేంద్రప్రసాద్, పసునూరి వెంకట్, రాజశేఖర్, అక్కనపెల్లి రఘువీర్ పాల్గొన్నారు.

ఆశ్రమానికి వృద్ధురాలు



వృద్ధాశ్రమానికి తీసుకెళ్తున్న గ్రామస్తులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని తిమ్మాపూర్‌లో రోడ్డు పక్కనే చిన్న గుడిసెలో నివసిస్తున్న అనాథ వృద్ధురాలు లచ్చవ్వను వృద్ధాశ్రమంలో చేర్పించాలని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ నరేశ్‌కు సూచించిన విషయం తెల్సిందే. దీంతో నరేశ్ లచ్చవ్వను తీసుకురావాలని బీఆర్ఎస్ నాయకులు నోముల రంజిత్‌రెడ్డికి తెలపగా ఆయన తన కారులో తోపారపు నర్సయ్యతో కలిసి జగిత్యాలలోని తారక రామనగర్‌లో వృద్ధాశ్రమంలో చేర్పించారు.

షరతులు లేకుండా ధాన్యం కొనాలి



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న శ్రావణి

సారంగాపూర్: వరిధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి అన్నారు. బీర్‌పూర్ మండలంలోని పలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ, రైతులు ఆశించిన స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం అందించడం లేదని, ధాన్యం కొనుగోలులో జాప్యం చేయడంతో రైతులకు నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని షరతులు లేకుండా కొనాలని డిమాండ్ చేశారు. నాయకులు పాత రమేశ్, గర్షకుర్తి రమేశ్, బండారి రవి, ప్రభాకర్‌రెడ్డి, తాటి తిరుపతి, ప్రశాంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చివేత

మెట్‌పల్లి: పట్టణంలోని జాతీయ రహదారిపై పలు చోట్ల ఏర్పడ్డ గుంతలు ప్రమాదకరంగా మారాయి. వాటిని పూడ్చే విషయంలో సంబంధిత అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. గుంతల వల్ల తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిని గమనించిన ఎస్సీ అశోక్‌కుమార్ గుంతలు పూడ్చివేయించాలని స్థానిక అధికారులకు సూచించారు. దీంతో గురువారం పట్టణం నుంచి ఆరపేట శివారు వరకు గుంతలను పూడ్చివేయించారు. పోలీసులు చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పాస్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా రాజరస్



పాస్టర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

జగిత్యాలటౌన్: పాస్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా బడుగు రాజరస్ ఎన్నికయ్యారు. గురువారం జిల్లా కేంద్రంలోని గోవిందుపల్లి యేసు రక్తం మినిస్ట్రీ చర్చిలో అసోసియేషన్ సమావేశం నిర్వహించగా, నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ఎదిరి జాన్‌పాల్, పల్లికొండ గిద్యోను, గజ్జల శ్యామ్యూల్, ప్రధాన కార్యదర్శి ఎలగందుల శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి దూలూరి ప్రసాద్, సహ సంయుక్త కార్యదర్శి మల్యాల నరేశ్ తదితరులను ఎన్నుకున్నారు.

పదోన్నతులు చేపట్టాలి

జగిత్యాల: టీచర్ల బదిలీలు, పదోన్నతులను ప్రభుత్వం వెంటనే చేపట్టాలని టీపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. టీపీటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం పతాకాన్ని ఆవిష్కరించారు. పెండింగ్ డీఏ మంజూరు చేయాలని, పీఆర్సీని ప్రకటించాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు రాంచంద్రం, ప్రధాన కార్యదర్శి గోవర్ధన్, సూద రాజేందర్, రఘుపతి, రాజయ్య, రాజిరెడ్డి, చంద్రశేఖర్, రాజయ్య, తిరుపతి, శ్రీనివాష్, రాంకుమార్, విఘ్నేష్, సుధాకర్, రవి, సంతోష్, లచ్చయ్య పాల్గొన్నారు.

జీవశాస్త్రం, భౌతికశాస్త్రం పరీక్షలు వేర్వేరుగా ఉండాలి



ఎమ్మెల్సీ కొమురయ్యకు వినతిపత్రం అందజేస్తున్న టీబీఎస్ఎఫ్ నాయకులు

జగిత్యాల: జీవశాస్త్రం, భౌతికశాస్త్రం పరీక్షలు వేర్వేరుగా నిర్వహించాలని, అప్పుడే ఫలితాలు బాగుంటాయని టీబీఎస్ఎఫ్ జిల్లా నాయకులు ఎమ్మెల్సీ మల్క కొమురయ్యకు గురువారం వినతిపత్రం అందించారు. 6, 7 తరగతుల్లో సైన్స్ పాఠ్యపుస్తకాల్లో ఫిజికల్, బయోలాజికల్ అంశాలను వేర్వేరుగా ప్రచురించాలన్నారు. 8 నుంచి 10వ తరగతి వరకు ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ పరీక్షలను 100 మార్కులకు నిర్వహించాలన్నారు. పదో తరగతి సైన్స్ పరీక్షల్లో విద్యార్థి ఫిజికల్, బయోలాజీలో ఎందులో ఫెయిలైతే ఆ పరీక్షను మాత్రమే రాసేలా అనుమతించాలన్నారు. టీబీఎస్ఎఫ్ అధ్యక్షుడు వీరబత్తిని రాజ్‌గోపాల్, జనరల్ సెక్రటరీ తిరుపతి, మచ్చ శంకర్, సీహెచ్.లక్ష్మణ్, జగదీశ్వర్, రజిత, గంగాధర్, పెద్దిరాజం, నర్సయ్య, రామకృష్ణ, బి.రామకృష్ణ, లింబగిరి స్వామి పాల్గొన్నారు.

మానసిక వేదనతోనే పంచాయతీ కార్యదర్శి మృతి



మాట్లాడుతున్న బలరాం

జగిత్యాలక్రైం: మానసిక వేదనతోనే మంచిర్యాల జిల్లా ఇందెన్‌పల్లి పంచాయతీ కార్యదర్శి ఎర్రోజు చంద్రమౌళి మృతిచెందాడని పంచాయతీ కార్యదర్శుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బలరాం అన్నారు. చంద్రమౌళి అంత్యక్రియలు జగిత్యాలలో గురువారం నిర్వహించగా.. పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు పాల్గొన్నారు. సర్పంచుల పదవీకాలం ముగిసినప్పటి నుంచి కార్యదర్శులు పాలన సాగిస్తున్నారని, ప్రభుత్వం నిధులు విడుదల చేయకున్నా తాగునీరు, పారిశుధ్య నిర్వహణ, ఇతర అభివృద్ధి పనులు చేపట్టాలని ఒత్తిడి తెస్తుండటంతో సొంత డబ్బులు ఖర్చు చేసి బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. చంద్రమౌళికి ప్రభుత్వం నుంచి దాదాపు రూ.4లక్షల బిల్లులు రావాల్సి ఉందన్నారు. చంద్రమౌళి కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్యదర్శుల సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు పూదరి నరేందర్, బాబురావు, శ్రావణ్‌కుమార్, గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు కందుకూరి రవిబాబు, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి, రాంకిషన్‌రావు, నయీం, సిద్దిపేట అధ్యక్ష, కార్యదర్శులు మురళీ, సంతోష్, నాయకులు శ్రీనివాస్‌నాయక్, సంతోష్ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న రమేశ్‌గౌడ్

కోరుట్లరూరల్/మల్లాపూర్: కోరుట్ల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన కృష్ణ చైతన్యను గురువారం తెలంగాణా మీసేవ ఆపరేటర్స్ అసోసియేషన్ మండల శాఖ ఆధ్వర్యంలో సన్మానించారు. అలాగే మల్లాపూర్ తహసీల్దార్‌గా గుగ్గిళ్ల రమేశ్‌గౌడ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌ను డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐలు రాజేశ్, రెవెన్యూ సిబ్బంది, అంబేడ్కర్ యువజన సంఘాల రాష్ట్ర నాయకులు, అడ్వకేట్ ఎర్ర రమేశ్, మండల అధ్యక్షుడు పెద్దిరెడ్డి లక్ష్మణ్, నాయకులు ఉయ్యాల లక్ష్మణ్ సన్మానించారు.

జయశంకర్ విగ్రహానికి కళ్లజోడు



విగ్రహానికి అద్దాలు అమర్చుతున్న ప్రసాద్

జగిత్యాలటౌన్: పట్టణంలోని డిగ్రీ కళాశాల సమీపంలో స్థానిక నాయకులు గతంలోనే ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని నెలకొల్పారు. ఆ విగ్రహానికి ఉన్న కళ్లజోడును ఇటీవల గుర్తు తెలియని పోకిరీలు తొలగించారు. గమనించిన రాళ్లబండి ప్రసాద్ అనే వెల్డింగ్ షాపు నిర్వాహకుడు కళ్లజోడు తయారు చేసి గురువారం విగ్రహానికి అమర్చి తన అభిమానాన్ని చాటుకున్నాడు.

మడేలయ్య స్వామి ఉత్సవాలు



మల్లాపూర్: మండలంలోని వేంపల్లి–వెంకట్రావ్‌పేటలో గురువారం రజకసంఘం ఆధ్వర్యంలో మడేలయ్య స్వామి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో తరలివచ్చి స్వామివారికి నైవేద్యం సమర్పించారు.

దళిత నాయకులను కించపరచడం సరికాదు

జగిత్యాలటౌన్: దళిత నాయకులను కించపరిచేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన మాజీ మంత్రి జీవన్‌రెడ్డి అనుచరులు బండారి మధు, అక్కినపెల్లి కుమార్ బహిరంగ క్షమాపణ చెప్పాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుమాల గంగారాం డిమాండ్ చేశారు. చెప్పులు కుట్టుకునే వ్యక్తిని తమ నాయకుడు జీవన్‌రెడ్డి జిల్లా అధ్యక్షుడిని చేయడమే కాకుండా.. నాలుగుసార్లు ఓడినా తిరిగి ఎమ్మెల్యే టికెట్ ఇప్పించి.. గెలిపించి.. ప్రభుత్వ విప్‌గా చేశారని ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను ఉద్దేశించి పెట్టిన పోస్టులు వైరల్‌గా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. బోనగిరి కిషన్, బెజ్జంకి సతీశ్, బిరుదుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో పారిశుధ్య పనులు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మురుగుకాల్వల పైకప్పులను తొలగించి చెత్తచెదారాన్ని తొలగించారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

కోరుట్లరూరల్: రైతుల కోసం ప్రభుత్వ రాయితీపై అందించే జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి నాగమణి గురువారం తెలిపారు.

వయోధికుల సంరక్షణ చట్టం అమలుపై హర్షం

కోరుట్ల: వయోధికుల సంరక్షణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేయడంపై తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది.

మొక్కలు సిద్ధం చేయండి

కథలాపూర్: వచ్చే నెల చేపట్టే వన మహోత్సవం కార్యక్రమానికి నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేయాలని ఉపాధి హామీ ఏపీవో రాజేందర్ తెలిపారు. మండలంలోని చింతకుంట, భూషణరావుపేట గ్రామాల్లోని వన నర్సరీలను గురువారం పరిశీలించారు. మొక్కలు ఎన్ని ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉండాలన్నారు.





బోనమెత్తిన మోరపల్లి

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి గ్రామంలో గురువారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పోచమ్మ బోనాల పండగ ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున నెత్తిన బోనాలతో డప్పు చప్పుళ్ల మధ్య శోభాయాత్రగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం, ఒడిబియ్యం సమర్పించారు.



బుగ్గారం: ధర్మపురిలోని మార్కెట్‌యార్డు రోడ్డులో 11 కేవీ విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. స్తంభాలు పూర్తిగా వంగిపోయాయి. నల్లరేగడి నేల కావడంతో వర్షాలు కురిస్తే మరింత వంగిపోయే అవకాశం ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

అక్రమంగా గోవులను రవాణా చేస్తే చర్యలు



వాహనాలు తనిఖీ చేస్తున్న అధికారులు

మెట్‌పల్లిరూరల్: జిల్లా సరిహద్దు అయిన బండలింగాపూర్ గండి హనుమాన్ ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన అంతర్‌జిల్లా సరిహద్దు చెక్‌పోస్ట్‌ను అధికారులు తనిఖీ చేశారు. మెట్‌పల్లి మండల పశువైద్యాధికారి కొమ్మెర మనీషా ఆధ్వర్యంలో గురువారం తనిఖీలు జరిగాయి. ఆమె మాట్లాడుతూ బక్రీద్ నేపథ్యంలో చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పశు సంరక్షణ చట్టం ప్రకారం గోవులు, దూడలను చంపవద్దన్నారు. ఎక్కడైనా గోవులను రవాణా చేసినట్లు దృష్టికి వస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. పట్టుకున్న గోవులను పోలీసులు సురక్షితంగా గోశాలకు తరలిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం పోలీసులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అల్లీపూర్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు రాజేశ్

రాయికల్: మండలంలోని అల్లీపూర్‌లో జమాతే ఇస్లామీ హింద్ కోరుట్ల, రాయికల్ శాఖ ఆధ్వర్యంలో గురువారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు రజిత, మీర్జా ఇనాయిత్‌బేగ్, చింత రమేశ్ గ్రామంలోని సుమారు 300 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోరుట్ల అధ్యక్షుడు ఇలియాస్‌ఖాన్, రాయికల్ అధ్యక్షుడు శంషేర్, కార్యకర్తలు నయిమొద్దీన్, ఆరీఫ్‌ఖాన్, మసూద్‌అలీ, అలీబేగ్, నసీరోద్దీన్, మహ్మద్ అజాద్, ఫయాజ్, మసూమ్ అలీబేగ్, వాహిద్, ఇస్మాయిల్, లాయక్, నిహాల్, ఎజాజ్, అహ్మదబేగ్ పాల్గొన్నారు.

లోవోల్టేజీ సమస్య రాకుండా ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు



మాట్లాడుతున్న సిందూర్‌శర్మ

రాయికల్: రాయికల్ పట్టణ ప్రజలకు లోవోల్టేజీ సమస్య తీర్చడానికే కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నామని ఏడీఈ సిందూర్‌శర్మ అన్నారు. గురువారం పట్టణంలోని ప్రగతి హైస్కూల్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుతో లోవోల్టేజీ సమస్య తీరుతుందన్నారు. బల్దియాలో పలువార్డుల్లో ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈ తుమ్మల నవీన్, సబ్ ఇంజినీర్ సంతోష్, రాజు, మున్సిపల్ మాజీ చైర్మన్ మోర హన్మండ్లు, నాయకులు మహేందర్, రాకేశ్‌నాయక్, రాము పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రధాని మోదీ ధ్యేయం



మాట్లాడుతున్న సత్యం

రాయికల్: రైతు సంక్షేమమే ప్రధాని మోదీ ధ్యేయమని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మర్రిపల్లి సత్యం అన్నారు. గురువారం పట్టణంలో మాట్లాడారు. ప్రధాని మోదీ ఖరీఫ్ సీజన్‌లో 14 రకాల పంటలకు మద్దతు ధర పెంచుతూ రూ.2.70 లక్షల కోట్ల బడ్జెట్‌ను విడుదల చేశారని గుర్తుచేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పాలిట రాక్షసంగా ప్రవర్తిస్తోందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని ఆంక్షలు లేకుండా కొనాలని, ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినట్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పట్టణ అధ్యక్షుడు కుర్మ మల్లారెడ్డి, నాయకులు బన్న సంజీవ్, కూనారపు భూమేశ్, మహిళా మోర్చా నాయకులు సాంబారి కళావతి, మమత పాల్గొన్నారు.

అహల్యాబాయ్ స్ఫూర్తితో ముందుకెళ్లాలి

గొల్లపల్లి: అంటరానితనం, మూఢనమ్మకాలపై చైతన్యం నింపి మహిళలతో సొంతంగా సైన్యాన్ని తయారుచేసిన గొప్ప యోధురాలు రాణి అహల్యాబాయ్ హోల్కర్ అని అహల్యబాయి హోల్కర్ జయంతోత్సవాల కమిటీ జిల్లా కన్వీనర్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యం అన్నారు. మండలంలోని గుంజపడుగులో స్వయం సహాయక, మహిళా సంఘాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అహల్యాబాయి స్ఫూర్తితో మహిళలు ముందుకెళ్లాలని, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగడానికి కృషి చేయాలని కోరారు. సభ్యులు సాంబారి కళావతి, దురిశెట్టి మమత, నాయకులు మారం గణేశ్, చందు, రంగు మహేందర్, శెట్టి మధు, తవుటు రాము తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



గేదె కళేబరం

ధర్మపురి: మండలంలోని నాగారం గ్రామంలో గురువారం కరెంట్ షాక్‌తో పాడిగేదె మృతిచెందింది. గ్రామంలోని నువ్వుల నాగయ్యకు చెందిన గేదె సమీపంలోని ఖాళీ స్థలంలో మేత కోసం తిరుగుతుండగా ఓ విద్యుత్ స్తంభానికి గల సపోర్ట్ వైరుకు తాకడంతో షాక్ గురై మృతిచెందింది. గేదె విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

రాయికల్ ఆస్పత్రి తనిఖీ

రాయికల్: రాయికల్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిని గురువారం జిల్లా వైద్యాధికారి ప్రమోద్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలని సూచించారు. మౌలిక వసతుల కల్పనపై ఆరా తీశారు.